క్లుప్తంగా

నీటి తీరువా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి



వేమూరు: నీటి తీరువా పన్నుల వసూళ్లు వీఆర్వోలు వేగవంతం చేయాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వస్తోందని, వీఆర్వోలు రైతులతో మాట్లాడి నీటి తీరువా పన్నులు వసూలు చేయాలని సూచించారు. అదే విధంగా ఇళ్ల నిర్మాణం కోసం పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరులో నిర్లక్ష్యం చేయరాదని ఆమె చెప్పారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం నీటి తీరువా పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉందన్నారు. వీఆర్వోలు నీటి తీరువా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో పల్లకి ఉత్సవం



జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగాంగా బుధవారం స్వామి వారికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్నాయి. స్వామి వారికి దొప్పలపూడి నారాయణరావు దంపతులు పంచామృత అభిషేకం నిర్వహించారు. సాయంత్రం విరజాజి పుష్పాలతో స్వామి వారికి అష్టోత్తర, సహస్ర నామార్చన జరిపారు. అర్చకులు పంచ సుక్తం, మన్య సుక్తం పారాయణం చేశారు. భక్త సమాజం వారు హనుమాన్ చాలీసా పారాయణ, గోవింద నామాలను పారాయణ చేశారు. పల్లకి ఉత్సవంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పెద్దింటమ్మ కొలుపులు



నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామ దేవత పెద్దింటమ్మ అమ్మవారి కొలుపులు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి కొలుపులలో మొదటి రోజు అమ్మవారి పావనం, ఘటంను, వీరతాళ్ళు, వీర కత్తులను గ్రామస్తులు సూర్యలంక సముద్రతీరానికి తీసుకుని వెళ్లి పుణ్యస్నానాలచరించి పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామానికి తీసుకుని వచ్చి వీధులలో మంగళవాయిద్యాలతో కొలుపులు నిర్వహించారు. గురువారం అమ్మవారి ఘటంకు గ్రామంలో నగరోత్సవం నిర్వహిస్తామని, శుక్రవారం మహాలక్ష్మి పూజలు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం పగలు రాత్రి అమ్మవారికి కొలుపులు నిర్వహించి ఆదివారం పెద్దింటమ్మకు నైవేద్యాలు సమర్పించటంతో పాటు కనుల పండువగా తిరునాళ్ల నిర్వహిస్తామన్నారు. సోమవారం పోతురాజు కొలుపులు జరుగుతాయని తెలిపారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు పట్టణ స్థాయిలో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు కోచ్ ఎస్. వినయ్‌కుమార్ తెలిపారు. పోటీలలో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా దర్విక్-భార్గవ్, రన్నర్స్‌గా సందీప్-ప్రణీత్ నిలిచారు. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో జిషన్ బేగ్-అభిషేక్ విన్నర్స్‌గా, వంశీధర్-కార్తీక్ రనర్స్‌గా నిలిచారు. సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా జ్యోతిష్-విజయ్ కృష్ణ, రన్నర్స్‌గా సత్య-లాస్విత్ గెలుపొందారు. జూనియర్స్ బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిత్య-తేజస్వి, రన్నర్స్‌గా భావన-రోష్మిత, సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా దుహిత-ఉష్మశ్రీ, రన్నర్స్‌గా టిమ్సి-సాత్విక గెలుపొందారు. విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఎం. రవిశంకర్, సాయిలలిత, హ్యాండ్ బాల్ కోచ్ నాగరాజు, బోస్, సాయికృష్ణ, రాము, సాయి చరణ్, శ్రీమన్నారాయణ, విజ్ఞాన్, అనురూప్, నోయల్ పాల్గొన్నారు.

నిరాదరణకు గురవుతున్న ప్రభుత్వ పాఠశాలలు



నిర్మాణం మధ్యలో ఆగిపోయిన నడింపల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనం



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

- విద్యా రంగంపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు
- మధ్యలో ఆగిపోయిన భవన నిర్మాణాలు
- పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్న తల్లిదండ్రులు

రేపల్లె: ప్రభుత్వ విద్యారంగం రోజురోజుకు నిరాదరణకు గురవుతుంది. విద్యార్థుల సంక్షేమం దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీరుగార్చుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ దిశగా తీర్చిదిద్దగా నేడు కూటమి ప్రభుత్వం నాడు-నేడును నీరుగార్చే దిశగా అడుగులు వేస్తోంది. నిర్మాణంలో ఉన్న పాఠశాలల భవంతుల పనులు జరగనివ్వకుండా అడ్డుపడుతూ విద్యా రంగంపై తనకున్న ఈర్ష్యాద్వేషాలను వెలిబుచ్చుతోంది. ధనికులకే కార్పొరేట్ విద్య, కార్పొరేట్ సౌకర్యాలు అందాలంటూ, ప్రభుత్వ పాఠశాలలను నిరాదరణకు గురిచేస్తూ పేద విద్యార్థుల పట్ల సవితి ప్రేమ చూపుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బడి బయటపిల్లలు సైతం బడిబాట పట్టేలా చర్యలు తీసుకుని అనేక సంక్షేమ పథకాలు అందించింది. విద్యార్థులకు అందించే అమ్మ ఒడిని అమ్మకు వందనం పేరుతో అమలు చేస్తామని చెప్పి నేడు ఆ పథకానికి మంగళం పాడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాగానే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కుంటు పడిందనటానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవటమే నిదర్శనంగా నిలుస్తోంది.

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల వివరాలిలా...

రేపల్లె నియోజకవర్గంలో ప్రాథమిక పాఠశాలలు 242 ఉండగా 5,915 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 31 ఉండగా 1,964 మంది చదువుకుంటున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలు 29 ఉండగా 7,108 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి

నాడు-నేడు పథకం ద్వారా తొలి విడతలో 89 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.13.79 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతలో రూ.11.4 కోట్లు కేటాయించి 83 పాఠశాలలను ఎంపిక చేయగా కేవలం 35 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఎన్నికల అనంతరం పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. నియోజకవర్గంలో 319 మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీలు ఉండగా, 11,069 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనంను సద్వినియోగం చేసుకుంటున్నారు.

నిలిచిపోయిన నాడు-నేడు పనులు

కార్పొరేట్‌కు తలదన్నేల తీర్చిదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టి పాఠశాలలను అభివృద్ధి చేసింది. ఫేజ్-1లో రేపల్లె నియోజకవర్గంలో 89 పాఠశాలలకు రూ.13.79 కోట్ల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. వీటిలో రేపల్లె పట్టణ, మండల పరిధిలో 28, నగరం మండలంలో 23, చెరుకుపల్లి మండలంలో 19, నిజాంపట్నంలో 19 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికై నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. అన్ని హంగులతో నిర్మితమై విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

- ఫేజ్-2లో రూ.11.4 కోట్ల నిధుల వ్యయంతో 83 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో రేపల్లె పట్టణ, మండలంలో 29, నగరంలో 12, చెరుకుపల్లి 17, నిజాంపట్నం 25 పాఠశాలలు ఎంపికయ్యాయి. రేపల్లెకు సంబంధించి 29 పాఠశాలలకు 9 పాఠశాలల్లో పనులు పూర్తవ్వగా, 20 పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి. నగరంలో 12 పాఠశాలలకు 5 పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తవ్వగా, 7 నిర్మాణంలో ఉన్నాయి. చెరుకుపల్లిలో 17 పాఠశాలలకు 10 పాఠశాలల్లో పనులు పూర్తవ్వగా, 7 నిర్మాణంలో ఉన్నాయి. అదేవిధంగా నిజాంపట్నంలో 25 పాఠశాలలకు 11 పాఠశాలల్లో పూర్తవ్వగా 14 నిర్మాణంలో ఉన్నాయి. అయితే ప్రస్తుతం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి పాఠశాల అభివృద్ధి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు లేకుండా పనులు జరగటం లేదు

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో డబ్బులు లేకుండా ఏపని జరగటం లేదనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పేర్కొన్నారు. వీటిపై అనేక ఫిర్యాదులు వస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవటంలేదన్నారు. పట్టణంలోని పటేల్ నగర్‌లో బుధవారం పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో శీలం మాట్లాడుతూ కేసులు పెడతారన్న భయంతో ప్రజలు ప్రశ్నించటం లేదన్నారు. అన్ని శాఖల అధికారులను కలిసి దీనిపై చర్చిస్తామని చెప్పారు. ప్రతి మండలంలో కార్యాలయం పెట్టి ప్రజల పక్షాన పోరాడతామన్నారు.

రక్షణ కల్పించలేకపోయారు

దేశంలోని పహల్గాం టూరిస్టలకు రక్షణ కల్పించటంలో బీజేపీ ప్రభుత్వం విఫలం చెందిందని జేడీ శీలం విమర్శించారు. ఉగ్రవాదులు ఉన్నారన్న సంకేతాలు ఉన్నప్పటికీ రక్షణ కల్పించకపోవటం దారుణమన్నారు. అమెరికా అధినేత ట్రంప్ దగ్గర మోదీ ఎందుకు సాగిలపడ్డారో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా అంజిబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీపతి ప్రకాశం, తాడికొండ వెంకటేశ్వరరావు, కేశన రామకోటేశ్వరరావు, పార్లమెంట్ పర్యవేక్షకులు గడ్డంపాలు విజయ్ కుమార్, బూరగ సుబ్బారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, శీలం సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు శంకరరెడ్డి, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, ఎస్‌వీఆర్ కుమార్, బక్కా రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్



అమర్తలూరు(వేమూరు): మండల కేంద్రంలోని టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేనల్లుడు ఇంటిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్సై జానికి ఆమర్ వర్ధన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.30,100 వేలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అమర్తలూరు మండలంలో పేకాట, కోడి పందేల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నేడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభను గురువారం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, అమరావతి ఐకాన్ అధ్యక్షులు వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరిగిగే ఈ ముగింపు కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. ఈ శిబిరంలో చిన్నారులు నేర్చుకున్న వివిధ రకాల నృత్యాలను ప్రదర్శిస్తారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి

ఫిరంగిపురం: ఉపాధి కూలీల వేతనం రోజుకు రూ.600 పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా 20న కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనుల సమయంలో గాయాలపాలైన, మరణించినా వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, రైతు సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నాగరాజులు పాల్గొన్నారు.

రవాణా రంగాన్ని దెబ్బకొట్టేలా కేంద్రం విధానాలు

- 20న దేశవ్యాప్త సమ్మెలో రవాణారంగ కార్మికులు పాల్గొనాలి
- కార్మికులకు సీఐటీయూ నాయకుల వినతి



రవాణారంగ కార్మికులతో మాట్లాడుతున్న హుస్సేన్‌వలి

తెనాలి: వ్యవసాయ రంగం తర్వాత కోట్లాదిమందికి జీవనోపాధి కల్పిస్తున్న రవాణా రంగాన్ని దెబ్బకొట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ, తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి కోరారు. సమ్మె ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావుతో కలిసి పట్టణంలో పలుచోట్ల కరపత్రాలు పంచుతూ గ్రూపు సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో హుస్సేన్‌వలి మాట్లాడుతూ న్యాయ సంహిత చట్టం ద్వారా కొద్దిపాటి తప్పులకు కూడా భారీ జరిమానాలు, జైలు శిక్షలు విధించటం దుర్మార్గమన్నారు. రవాణారంగాన్ని కాపాడుకునేందుకు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో లారీ, మినీలారీ, ఆటోల డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముద్దన సాంబశివరావు మాట్లాడుతూ 20వ తేదీ ఉదయం 9 గంటలకు తెనాలి మున్సిపల్ కార్యాలయం నుంచి జరిగే ప్రదర్శనల్లో కార్మికులు పాల్గొనాలని కోరారు. శివసాంబిరెడ్డి తన ప్రసంగంలో, మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగాన్ని ఇప్పుడు రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను రైతులు, కార్మికులు కలసి ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. తొలుత వీఎస్సార్ కాలేజీ ఎదురుగా గల మినీ లారీస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ గంగానమ్మపేట వంతెన వద్ద కార్మికుల్ని, మున్సిపల్ కార్యాలయం వద్ద, మెయిన్ రోడ్డు, మారిస్‌పేట, చెంచుపేటలో కార్మికుల్ని కలసి కరపత్రాలు పంచి వారితో మాట్లాడారు. కార్యక్రమాల్లో షేక్ కరీముల్లా, షేక్ మీరాఖాన్,ఎస్ కొండలు, షేక్ సుభాని, ఎస్.పిచ్చిరెడ్డి, షేక్ హసన్, షేక్ జిలాని, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

తెనాలి బస్టాండ్‌లో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు

తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



మాట్లాడుతున్న డిపో మేనేజర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. డిపో ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ ఆవరణ పల్లంగా ఉండటం వలన వర్షం వచ్చిన సమయంలో నీరు నిలచి ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో రూ.30లక్షల నిధులతో దాని ఎత్తు పెంచే పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే మరో రూ.50లక్షలతో అంతర్గత రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామన్నారు. అనుమతులు రాగానే వాటిని ప్రారంభిస్తామన్నారు. వేసవిలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రక్షిత మంచినీటిని, ఆధునిక కుర్చీలు, ఫ్యాన్‌లు, లైట్లు వంటి వాటిని డిపో ఆవరణలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) అభిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి హాని కలిగిస్తే చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల



వ్యాపారులకు సూచనలిస్తున్న డాక్టర్ కె.హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి ఎటువంటి హాని కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. బోసురోడ్డు, మెయిన్ రోడ్డు, మార్కెట్ ఏరియాలలోని పలు స్వీట్స్ షాపులను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటిపై ఎటువంటి మూతలు పెట్టకపోవటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. పదార్థాలపై ఈగలు వాలకూడదన్నారు. వీటివలన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే వాటిపై మూతలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమె వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులకు అవగాహన



అమర్తలూరు(వేమూరు): ద్విచక్ర వాహనదారులందరు హెల్మెట్ ధరించాలని ఎస్సై జానకి ఆమర్ వర్ధన్ తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరు హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్య సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం వాహనాలు నడపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన దారులు పాల్గొన్నారు.

సర్వేలు సక్రమంగా నిర్వహించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



పేరలి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: ప్రభుత్వ సర్వేలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఎంపీడీవో పేరలి గ్రామ సచివాలయంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలందించేందుకు ప్రభుత్వం అనేక సర్వేలను చేయిస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవటానికి, పేర్లు మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినందున ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు. గ్రామంలో ప్రజల అవసరాల మేరకు తాగునీరందించాలని సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ముందుగా పేరలి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల హాజరు తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాటుసారాతో అన్నీ అనర్థాలే

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు సీఐ రామారావు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు సీఐ రామారావు

నిజాంపట్నం: నాటుసారా తాగితే అనారోగ్యం కొని తెచ్చుకోవటమేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఒంగోలు సీఐ రామారావు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిండి పంచాయతీ పరిశావారిపాలెం, అదవల, జంపనివారిపాలెం, యేమినేనివారిపాలెం, కేసనావారిపాలెం గ్రామాలలో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారాకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. నాటుసారాను అపరిశుభ్రంగా, అశాస్త్రీయ పద్ధతిలో తయారు చేయటంతో అనారోగ్యాలకు గురవ్వక తప్పదన్నారు. దీనిలో విషపూరిత రసాయనాలు ఉండి తాగేవారి ఆరోగ్యం రోజురోజుకు క్షీణించటంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా తమ కుటుంబాలను రోడ్డుపాలు చేసుకున్నవారవుతారన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎనిమిది సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించటం జరుగుతుందన్నారు. సారాయి తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు విక్రయించే వారిపై నిరంతరం దృష్టి పెట్టటం జరుగుతుందన్నారు. గ్రామాలలో నాటుసారా, ముడిపదార్థాలు విక్రయించిన వారి వివరాలు గ్రామస్తులు అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నాటుసారా రహిత గ్రామాలను నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ శోభయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె: హనుమజ్జయంతిని పురస్కరించుకొని చైతన్య వేదిక, సమరసత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన నిజంపట్నం మండలం గరువుపాలెం హనుమాన్ విగ్రహం నుంచి నగరం హనుమాన్ దేవాలయం వరకు జరుగు శోభాయాత్రను జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారకులు జంజనం హేమశంకరరావు కోరారు. పట్టణంలోని 1వ వార్డ్ రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. హిందువుల ఐక్యతను చాటి చెప్పేలా 18వ తేదీన జరిగే శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు గరువుపాలెం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర నగరం హనుమాన్ ఆలయంకు చేరుతుందన్నారు. శోభాయాత్రలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు బండారు రమేష్, పేరం కోటేశ్వరరావు, జంగం శ్యాంప్రసాద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు



కూచిపూడి నుంచి పెదపూడి గ్రామానికి వెళుతున్న మట్టి ట్రాక్టర్లు

అమర్తలూరు(వేమూరు): కూటమి ప్రభుత్వంలో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గత పది రోజులు క్రితం పొలంను చేపల చెరువు చేశారు. పొలంలో మట్టి ఇతర గ్రామాలకు తరలించినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు చేపల పిల్లల పెంపకం చెరువు మట్టి తవ్వకాలు చేపట్టారు. చుండూరు మండలం మండూరు గ్రామానికి ట్రాక్టరు రూ.2 వేలకు అమ్ముతున్నారు. తెనాలి మండలం పెదరావూరు గ్రామానికి రూ.1600కు అమ్ముకుంటున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. గత ప్రభుత్వంలో రైతు పొలంలో మట్టి తీసిన రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి వారిపై చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో మట్టి తవ్వకాల నిర్వాహకులను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు భయపడుతున్నారు. రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాలు నిలిపి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాస్త్రవేత్తలు చెప్పిన వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

బాపట్ల: శిక్షణలో శాస్త్రవేత్తలు చెప్పిన వాటిపై రైతులు అవగాహన పెంచుకోవాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ ఇవ్వటం ఎంతో మంచిదన్నారు. ఈ నెల 28 వరకు నిర్వహించే శిక్షణలో అన్ని అంశాలను రైతులు నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నాగేశ్వరరావు, బాపట్ల ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఆర్.బాలమురళీధర్‌నాయక్, ఉషా, శాంసన్ తదితరులు ఉన్నారు.